క్లుప్తంగా

విద్య.. విజ్ఞానం.. వినోదం



నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై వివరిస్తున్న ఉపాధ్యాయుడు ప్రకాష్

నల్లజర్ల: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు విద్య.. వినోదాత్మకంగా సాగుతున్నాయి. రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ బాలలు వివిధ అంశాలలో శిక్షణ పొందుతూ తమలోని నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఏవీ రమణ పర్యవేక్షణలో వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా మానసిక వికాసానికి సంబంధించి ఆట, పాటలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం ఉపాధ్యాయుడు వి.ప్రకాష్ ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాలు వివరించారు.

ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం పరిశీలన



గోపవరంలో ఫ్యాక్టరీ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్

గోపాలపురం: నగ్గొండ పంచాయతీ పరిధి గోపవరంలో నిర్మించబోయే సీఎస్‌డీ ల్యాబ్ ఫ్యాక్టరీ స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మంగళవారం పరిశీలించారు. స్థలానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి తహసీల్దార్ బి.రవీంద్రనాథ్‌కు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేసీ తేజ్ భరత్‌కు సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు ఫ్యాక్టరీ నిర్మాణంతో అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని వివరించారు. ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని జేసీని కోరారు.

గురుమండల అధ్యక్షుడికి సత్కారం

ద్వారకాతిరుమల (?): మలకపల్లిలోని ఇమ్మానియేలు లూథరన్ సంఘం చర్చి వద్ద మంగళవారం గురుమండల అధ్యక్షునిగా పనిచేస్తున్న రెవ డి.బాబును ఘనంగా సత్కరించారు. ఇటీవల ఇక్కడ సినోడ్ టర్మ్ పూర్తి కావడంతో ఆయన బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని సంఘస్తులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడే పట్టాభిషేకం

- జేఎన్‌టీయూ కాకినాడ 9వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు
- హాజరుకానున్న వర్సిటీ కులపతి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



స్నాతకోత్సవ వివరాలు వెల్లడిస్తున్న వర్సిటీ వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు పూర్తి చేసినందుకు గుర్తింపుగా చేసే పట్టాల ప్రదాన వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వేదిక అవుతోంది. వివిధ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలలో ఉన్న వారికి సైతం పట్టా అందుకోవడానికి ఆహ్వానాలు పంపి అతిరథ మహారథుల చేతుల మీదుగా అందజేయనున్నారు. స్నాతకోత్సవ సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణలో పట్టా(ఒరిజనల్ డిగ్రీ) తీసుకోవడానికి ఏర్పాట్లు చేసింది. జీవితంలో మధురానుభూతిగా నిలిచే ఈ వేడుకలకు అర్హులైనవారు తమ వివరాలు వర్సిటీకు పంపించారు. గత ఏడాది డిసెంబర్‌లో స్నాతకోత్సవం నోటిఫికేషన్ జారీ చేసి గవర్నర్ అనుమతితో బుధవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 9వ స్నాతకోత్సవాన్ని రెండు సంవత్సరాలకు కలిపి ఒకేసారి నిర్వహిస్తున్నారు. 2020-21, 2021-22కు సంబంధించి రెండు సంవత్సరాల అకడమిక్ ఇయర్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అందజేస్తున్నారు. స్నాతకోత్సవంలో భాగంగా బీటెక్ విభాగంలో 107,595, బీఆర్క్ 124 ,బీఫార్మసీ 3,835, ఎంటెక్ 3,595, ఎంబీఏ 3,348, ఎంసీఏ 989, ఎం.ఫార్మసీ 645, బీబీఏ 33, ఫార్మడీ 468, బీఆర్క్ 124 ఎంఎస్‌ఐటీ 02 , ఒడీలు (ఒరిజనల్ డిగ్రీ) విద్యార్థులు పొందనున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన వారికి 66 బంగారు పతకాలు, 144 పీహెచ్‌డీలు అందజేయనున్నారు.

గ్రీన్‌కో ఫౌండర్ అనిల్‌కు గౌరవ డాక్టరేట్..
ఈ ఏడాది స్నాతకోత్సవం సందర్భంగా గ్రీన్ కో గ్రూప్ వ్యవస్థాపకుడు చలమలశెట్టి అనిల్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన చలమలశెట్టి అనిల్ యూకేలో నార్త్ వెస్ట్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ చేశారు. ఏపీ యంగ్ ఎంటర్ ప్రెన్యూర్ ఆఫ్‌ది ఇయర్, సౌత్ ఇండియా బిజినెస్ అచీవర్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులు సాధించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ ఎనర్జీ ఫోరమ్‌లకు నాయకత్వం వహిస్తున్నారు. 2006లో గ్రీన్ కో క్లీన్ ఎనర్జీ కంపెనీ అయిన గ్రీన్‌కో గ్రూప్ స్థాపించి భారతీయ ఇంధన రంగంలో తనదైన ముద్ర వేశారు. శాంత బయోటెక్ అధినేత పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాదరెడ్డి, విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి హాజరవుతున్నారని వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, పీఆర్ఓ సీహెచ్ సాయిబాబు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.



చలమలశెట్టి అనిల్, గ్రీన్ కో గ్రూప్ వ్యవస్థాపకులు

సంక్షేమ సారథులు వలంటీర్లు



పెరవలిలో వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు తదితరులు

ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

పెరవలి: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉంటూ వలంటీర్లు సంక్షేమ సారథులుగా కీర్తి పొందుతున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. పెరవలి దీపిక ఫంక్షన్ హాలులో వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పెరవలి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, కడింపాడు, పిట్టల వేమవరం, ముక్కామల, అండవల్లి, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, అజ్జరం గ్రామాల్లో 241 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలు కలసి పోటీ చేసినా వైఎస్సార్ సీపీని ఏమీ చేయలేవన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు మోసకారి అని, టీడీపీ దోపిడీ ప్రభుత్వమని ఆరోపించిన పవన్‌కల్యాణ్ ఇప్పుడెలా పొత్తు పెట్టుకుంటున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఇసుక, మట్టి దోపిడీకి నిలువెత్తు నిదర్శనమని ఆరోపించారు. తాను దోపిడీ చేయలేదని, గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేశానని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ధ్వజమెత్తారు. అనంతరం సేవా రత్న అవార్డులు పొందిన అజ్జరం, కాపవరం, ఖండవల్లి వలంటీర్లను సత్కరించారు. ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి, సొసైటీ అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి

నిడదవోలు రూరల్: భారత రెజ్లర్లను వేధిస్తోన్న ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు డిమాండ్ చేశారు. సమిశ్రగూడెంలో కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో రెజ్లర్లను అరెస్ట్ చేయడాన్ని మంగళవారం తీవ్రంగా ఖండించారు.

సీఎం జగన్‌తో చరిత్రాత్మక పాలన



నల్లజర్లలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నల్లజర్లలో గడప గడపకూ..

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నల్లజర్లలోని 5, 6 వార్డుల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ మేళ్ల వెంకటలక్ష్మి ,గ్రామ కమిటీ అధ్యక్షుడు కండెపు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ఏకైక లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చారన్నారు. ఈ ప్రాంతంలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని, సీసీ రోడ్లు వేయించాలని, ఇళ్ల స్థలాలు, పింఛన్లు ఇప్పించాలని పలువురు మహిళలు కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఏఓ కమల్ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్‌బాబు, హౌసింగ్ ఏఈ శివ, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, నాయకులు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, పల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలోని అన్ని వార్డుల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలను మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అజెండాలో పేర్కొన్న 24 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు మాట్లాడుతూ మాలకోడు మురుగు కాలువ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్న పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో మాలకోడు మురుగు కాలువ నుంచి ఎర్ర కాలువ వరకూ పూడికతీత పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శివారు ప్రాంతాల్లో అద్దె ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా, పట్టణంలో యర్నగూడెం రోడ్డుకు ఇరువైపులా, వైఎస్సార్ కాలనీలో మెయిన్ డ్రైన్‌లో సిల్ట్ తీయడం, ఎల్ఎంహెచ్ రోడ్డు, భీమదొర డ్రైన్, నంజీవయ్యనగర్, ఎంపీ రోడ్డు మెయిన్ డ్రైన్‌లలో సిల్ట్ తీయడం వంటి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బసివిరెడ్డిపేటలో కాలువ ఒడ్డున ఉన్న రెండు రేవుల మరమ్మతులు, పట్టణంలో వివిధ వార్డుల్లో అధ్వాన రోడ్ల మరమ్మతులు, జగనన్న కాలనీలో మురుగు కాలువలో ఆర్‌సీసీ పైపులతో కల్వర్టు నిర్మాణానికి, మున్సిపల్ కార్యాలయంలో బోర్‌వెల్ ఏర్పాటుకు, వివిధ వార్డుల్లో పాడైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి మొత్తం 25 పనులకు గాను మున్సిపల్ సాధారణ నిధులు రూ.2.61 కోట్లు మంజూరు కోసం కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, గంగుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: స్థానిక క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం 9 గంటలకు ఆలయ అర్చకులు, పండితులు అమ్మవారి మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ నవకలశ స్నపన నిర్వహించారు. అనంతరం శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలు, ఆ తరువాత పూర్ణాహుతి వేడుకను నేత్రపర్వంగా జరిపారు. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, సురేష్ దంపతులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

ముందస్తు సాగుకు సన్నద్ధం కావాలి



సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న ఏడీఏ జ్యోతిర్మయి

నల్లజర్ల: తుపానులు, విపత్తుల నుంచి పంటను గట్టెక్కించడానికి రైతులంతా ముందస్తు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జ్యోతిర్మయి సూచించారు. పడమర బోడవరం రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం వ్యవసాయ శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంట కాలం పది రోజులు ముందుకు రావడంతో అక్టోబర్, నవంబర్ మాసాలలో వచ్చే తుపానుల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. జూన్ మొదటి వారంలో నారుమళ్లు వేసుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని విత్తన శుద్ధి చేయాలని మరో ఏడీఏ రంగారావు సూచించారు. మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకురాలు యు.అనూష తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



నగ్గొండ పంచాయతీ వద్ద వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

గోపాలపురం: వలంటీర్ల సేవలు అభినందనీయమని నగ్గొండ సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు అన్నారు. నగ్గొండ పంచాయతీ వద్ద మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వలంటీర్ల పనితీరు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ఈ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు. కార్యదర్శి కె.అనురాధ, వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు యండపల్లి కవిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: అడిగిన వారందరికీ ఉపాధిహామీ పథకంలో పనులు కల్పించాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం సమిశ్రగూడెంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రబీలో రైతులకు సకాలంలో గోనె సంచులు అందజేయడంతో పాటు అకాల వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు మండల అధికారులు బాధ్యతగా పనిచేశారన్నారు. నవరత్న పథకాలు సక్రమంగా అందించడంతో పాటు మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ మొదటి అంతస్తులో అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణానికి రూ.1.20 లక్షలు మంజూరు చేసేందుకు సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, సచివాలయాల మండల కన్వీనర్ వెలగన పోలయ్య, కార్యాలయ ఏఓ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన కలెక్టర్



యర్నగూడెంలో భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

దేవరపల్లి: గుండుగొలను– కొవ్వూరు జాతీయ రహదారి నిర్మాణానికి తీసుకున్న భూములకు న్యాయమైన పరిహారం చెల్లించలేదని, భూములను పరిశీలించి పరిహారం ఇవ్వాలని దేవరపల్లి మండలం యర్నగూడెంకు చెందిన పోతుల సూర్యకుమారి, సూర్యనారాయణపురానికి చెందిన పుట్టా సుబ్బలక్ష్మి, పెన్మత్స సుబ్బారాజు కలెక్టర్ మాధవీలతకు అర్జీ చేశారు. ఆ అర్జీలను పరిశీలించిన కలెక్టర్ మంగళవారం యర్నగూడెం, సూర్యనారాయణపురంలోని భూములను పరిశీలించారు. 2017లో జాతీయ రహదారి విస్తరణకు ప్రభుత్వం రైతుల నుంచి భూములను సేకరించింది. ఈ భూములకు పరిహారం తక్కువ ఇచ్చారని అప్పట్లో రైతులు ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నారు. తన భూమిని జిరాయితీ భూమిగా పరిగణించి తక్కువ పరిహారం ఇచ్చారని రైతు పోతుల సూర్యకుమారి అర్జీ పెట్టుకున్నారు. సూర్యనారాయణపురానికి చెందిన సుబ్బలక్ష్మి, సుబ్బరాజు తమ భూములకు సెంట్లు లెక్కన పరిహారం ఇచ్చారని, గజాల లెక్కన ఇవ్వాలని కోరారు. దాదాపు ఆరేళ్లుగా రైతులు పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రస్తుతం కలెక్టర్ మాధవీలత చొరవ తీసుకుని భూములను పరిశీలించి రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, వీఆర్వో ఎం.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సేవాసమితి వితరణ

గోపాలపురం: పెద్దగూడెంకి చెందిన గుమ్మడి రమణ ఇటీవల ట్రాక్టర్ బోల్తాపడి గాయాల పాలయ్యాడు. అతనికి మంగళవారం రక్షణ సేవాసమితి సభ్యులు రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో రక్షణ సేవా సమితి ముందుంటుందని సమితి అధ్యక్షుడు గెల్లా ఏలీషా అన్నారు. బి.షాలేంరాజు, ఏసురాజు, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మరింతగా మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, జగనన్నకు చెబుదాం, సంక్షేమ పథకాల పర్యవేక్షణాధికారి గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. మండల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కలెక్టర్ కృతికాశుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ఇతర అధికారులతో కలసి కరప రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆరా తీశారు. మండల పరిధిలో ఎంత విస్తీర్ణంలో రబీ సాగు చేశారు, ఇంతవరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, రైతులకు మద్దతు ధర అందుతోందా అని ఆరా తీశారు. వీఏఏ ప్రశాంత్, పీఏసీఎస్ ప్రతినిధి డి.తమాదేవి రైతుల వద్ద ధాన్యం సేకరించి రైసుమిల్లుకు పంపే వరకు క్రమం వివరించి చెప్పారు. రసాయనిక, ఎరువులు, పురుగుమందులు సార్వాకు అందుబాటులో ఉంచిన విషయాన్ని ఏడీఏ కె.బాబూరావు వివరించారు. ఇంతవరకు ఎన్ని మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసింది, రైతులకు ఎంత సొమ్ము చెల్లించింది కలెక్టర్ కృతికా శుక్లా సీఎస్ గోపాలకృష్ణ ద్వివేదికి వివరించారు.

జిల్లాకు మూడో ర్యాంకు
గోపాలకృష్ణ ద్వివేది విలేకరులతో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అమలులో రాష్ట్రంలో కాకినాడ జిల్లా మూడో ర్యాంకులో ఉందన్నారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు గ్రామానికొక ప్రత్యేకాధికారిని నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. కాకినాడ భానుగుడి సెంటర్‌లో ఆర్టీసీ బస్‌స్టాప్ తీసేశారని, దానివల్ల ఆసుపత్రులకెళ్లే రోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు తెలుపగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలు చేయనున్న డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీని డెమో చేసి చూపించారు. ఆర్డీఓ బీవీ రమణ, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ డి.పుష్పమణి, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎస్.విజయ్‌కుమార్, ఏడీఏ కె.బాబూరావు పాల్గొన్నారు.



కరపలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణద్వివేది, కలెక్టర్ కృతికా శుక్లా

క్లుప్తంగా

6న వాహనాల బహిరంగ వేలం

దేవరపల్లి: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ పరిధి దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు జూన్ 6న స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్టు సీఐ దిమ్మల సుధ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు తీసుకువచ్చి స్థానిక స్టేషన్‌లో రూ.5 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. వాహనాలను పాడుకున్న వారు అదేరోజు వేలం సొమ్ముతో పాటు జీఎస్టీ చెల్లించాలని ఆమె వివరించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో గ్రామస్తులు

తాళ్లపూడి: స్థానిక కాళింగపేట రామాలయంలో సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జంధ్యాల గంగాధరశాస్త్రి, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవారం రెండో రోజు పూజలు కొనసాగాయి. జలాధివాసం, క్షీరాధివాసం, హోమం నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తామని వివరించారు.

పంచాయతీ ఎన్నికలపై విచారణ

తాళ్లపూడి: ఎన్నికల సమయంలో వేగేశ్వరపురం పంచాయతీ సర్పంచ్ అఫిడవిట్ తప్పుగా ఇచ్చారన్న విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాళ్లపూడి తహసీల్దార్ టి.రాధిక మంగళవారం విచారణ చేపట్టారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి వరహ రామారావు ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పుల అంశంలో వివరాలు తప్పుగా నమోదు చేశారని ఇదే గ్రామానికి చెందిన కురసాల సతీష్, రెడ్డిలు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకుని కోర్టుకు వెళ్లారు. దీనిపై విచారణ చేపట్టాలని కోర్టు నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో పాటు పంచాయతీ సర్పంచ్, కార్యదర్శుల వివరాలను విడివిడిగా నమోదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు

- జగనన్న పాలనను అనుకరించే యత్నం
- హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరులో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: మహానాడు పేరుతో టీడీపీ నిర్వహించిన సభలో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమైనవేనని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అటూ ఇటూ మార్చి చంద్రబాబు అనుకరిస్తున్నారని అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలన విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా వంటి పథకాలను ప్రభుత్వం ఇప్పుడు ఇస్తున్న దానికంటే కొంచెం పెంచి ఇస్తానని, మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తానంటూ మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ప్రజలు చంద్రబాబును సీఎంను చేస్తే ఏం ఒరగబెట్టారంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం జగనన్న విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడంతో పాటు అన్నివర్గాలకు మేలు చేకూర్చే విధంగా పాలన అందిస్తున్నారన్నారు. రుణమాఫీ పేరుతో చంద్రబాబు మోసం చేస్తే.. రూ.1,400 కోట్లను జగనన్న వచ్చిన తర్వాత అందించారన్నారు. ఈ రోజు రాష్ట్ర ప్రజలు జగనన్నే మా భవిష్యత్ అంటున్నారని అన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, రుణమాఫీ, అమ్మ ఒడి, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, ఆసరా, ఇళ్ల పట్టాల పంపిణీ వరకూ అన్ని పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. మహానాడులో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మే పరిస్థితుల్లో జనం లేరన్నారు. సీఎం జగన్ నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీ దేవి, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొరయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కొండంత అండ



బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానికంగా ఆయన క్యాంపు కార్యాలయంలో ఉండ్రాజవరం మండలం కాల్దారి గ్రామానికి చెందిన లబ్ధిదారులు అబ్బిన లక్ష్మి, ఎస్.వెంకన్నలకు మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.64 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంగారుకొండ పథకం అమలుకు చర్యలు

తాళ్లపూడి: ఐదేళ్ల లోపు పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా బంగారుకొండ పథకాన్ని అమలు చేస్తుందని సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి తెలిపారు. దీనిలో భాగంగా వయసుకు తగ్గ బరువు లేకుండా ఉన్న పిల్లలను గుర్తించి వారికి అదనపు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. మండలంలో బరువు తక్కువగా ఉన్న పిల్లలు 102 మంది ఉన్నారని తెలిపారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఈ పథకం సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.

జగనన్న పాలనకు జేజేలు



నిడదవోలు పార్టీ కార్యాలయంలో సంబరాల్లో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, తదితరులు



ద్వారకాతిరుమలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- పేదల గుండెల్లో సుస్థిర స్థానం
- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. భారీ కేక్‌ను ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గంలో రూ.1,333 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.672 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చేతల్లో చేసి చూపిన నేత సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ఓర్వలేని టీడీపీ, జనసేనలు తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని అన్నారు. పేదలకు ఇచ్చిన సెంటు భూమిని సమాధులతో పోల్చిన చంద్రబాబును రానున్న ఎన్నికల్లో పాతాళానికి తొక్కేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారన్నారు. జగన్ పాలనలో 50 శాతం మహిళలేనని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చట్టసభల్లో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా జగనన్న కుటుంబ సభ్యులేనని అన్నారు. జగన్‌ను 30 ఏళ్ల వరకూ సీఎంగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పట్టణ వైఎస్సార్ సీపీ కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే ఖాన్‌బాషా, పులిమంతుల రామారావు, గుర్రం జేమ్స్, గంగుల గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లూ ప్రజారంజక పాలనే : ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: జగనన్న జనరంజక పాలనకు పునాది పడి సరిగ్గా నాలుగేళ్లు పూర్తయ్యిందని, చంద్రబాబు దుర్మార్గపు పాలనకు ప్రజలు సమాధి కట్టింది కూడా ఆ రోజేనని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ద్వారకాతిరుమల కాపు కల్యాణ మండపంలో గోపాలపురం నియోజకవర్గ స్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలు మంగళవారం సంబరాలు జరుపుకొన్నారు. తొలుత దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే దక్కుతుందన్నారు. విప్లవాత్మక సంస్కరణల ద్వారా పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. ఏపీ, కర్ణాటక పథకాలను చంద్రబాబు కాపీ కొట్టి మేనిఫెస్టో తయారు చేశారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ఏపీలో అమలవుతున్న పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని విమర్శించిన టీడీపీ, ఇప్పుడు అదే సంక్షేమ పథకాలతో ముందుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు గారడీలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, ఎంపీపీలు బొండాడ మోహిని, ఉండవల్లి సత్యనారాయణ, బంకా విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, పొట్టి స్వర్ణలత, ముప్పిడి లక్ష్మి, కాకులపాటి లలిత, పార్టీ కన్వీనర్లు ప్రతాపనేని వాసు, పోతిరెడ్డి నాగరాజు, కూచిపూడి సతీష్, గగ్గర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఛాయాసోమేశ్వర స్వామి వారి దేవస్థానము

వేగేశ్వరపురం గ్రామం, తాళ్లపూడి మండలం, తూ.గో.జిల్లా

భూమి సేద్యపు బహిరంగ వేలం ప్రకటన

[illegible]

క్ర.సం.	భూమి ఉన్న గ్రామము	రీ.స. నెంబరు	భూమి విస్తీర్ణం ఎ.సెంట్లు	పాట ధరావత్తు
1	వేగేశ్వరపురం	135,145	5-40	20,000/-
2	వేగేశ్వరపురం	145	5-85	25,000/-

శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానము

ప్రక్కిలంక గ్రామము, తాళ్లపూడి మండలం, తూ.గో.జిల్లా

భూమి సేద్యపు బహిరంగ వేలం ప్రకటన

[illegible]

క్ర.సం.	భూమి ఉన్న గ్రామము	రీ.స. నెంబరు	భూమి విస్తీర్ణం ఎ.సెంట్లు	పాట ధరావత్తు
1	[illegible]	[illegible]	2-85	5,000/-

ఇట్లు : కార్యనిర్వహణాధికారి, తాళ్లపూడి గ్రూపు దేవాలయములు